# నాయకుల ఒత్తిళ్లు.. ప్రయివేటు స్థలానికి పట్టా

## స్పందనలో ఫిర్యాదు.. స్పందించని యంత్రాంగం

## న్యాయంకోసం అధికారులను వేడుకోలు


స్థలం పత్రాలను చూపుతున్న బాధితులు.

పెనుకొండ మే08 ప్రభాతవార్త : అతడు అధికారపార్టీలో దళితనాయకుడు..అధికారులపై ఒత్తిళ్లు తీసుకువచ్చి ఏకంగా తల్లి,పెళ్లం పేరుతో ఇంటిస్థలం పోజిషన్ సర్టిఫికెట్ సంపాధించారు. ఇక్కటే అసలు సమస్య మొదలైంది. ఇతను తల్లి,భార్యపేరుపైన తీసుకున్న పట్టా (పోజిషన్ సర్టిఫికెట్) సర్వేనెంబర్ ప్రయివేటు స్థలం. స్థలం యజమానినా స్థలంలో పట్టా ఎలా మంజూరు


పునాదులు తవ్విన దృశ్యం


తహాశీల్దార్‌తో మాట్లాడుతున్న స్థల యజమానులు

చేశారు. నాకు న్యాయం చేయమని కుటుంబం సభ్యులతో కలసి సబ్‌కలెక్టర్, తహాశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగితిరిగి వేశారిపోయిన ఘటన పెనుకొండలో చోటు చేసుకుంది. నగరపంచాయతీ పరిధి సర్వేనెంబర్ 680.2లో నారాయణమ్మ కాలనీ ఏర్పాటైంది. కాలనీ చివరల్లో మిగిలిన స్థలాలను వైసీపి నాయకులు శ్రీనివాసులు లేఅవుట్‌లో గుర్తించారు. అధికారులపై ఒత్తిళ్లు తీసుకువచ్చి లేని స్థలానికి ప్లాటున నెంబర్లు వేయించి 15.3.2023వ తేదిన అతని తల్లి, పెళ్లాం పేరుపైన పొజిషన్‌సర్టిఫికేట్ పొందారు. ఇక్కడే అసలు కథ ప్రారంభమైంది. కాలనీకి పక్కనే సర్వేనెంబర్ 680లో 26 సెంట్ల ప్రయివేటు స్థలం పెనుకొండకు చెందిన గీతాదేవి 2013లో కోనుగోలు చేసి రిజిష్టర్ చేయించుకున్నారు. ఈ స్థలంలో దురాక్రమణ చేసి శ్రీనివాసులు పునాదులు తవ్వడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ప్రయివేటు స్థలంలో పట్టా ఎలా ఇస్తారని, నా స్థలంలో పునాదులు తవ్వడానికి వీలు లేదని యజమాని అడ్డుకున్నారు. పట్టా ఉంది....స్థలం నాదే నీ ఇష్టం వచ్చిన చోట చెప్పుకోపో అంటూ రాత్రికి రాత్రే పునాదులు తవ్వకాలు చేపట్టారు. ఈ విషయంపై స్థలం యజమాని సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేశారు. సర్వే చేసి హద్దులు గుర్తించాలని సబ్‌కలెక్టర్ మండల సర్వేయర్‌ను ఆదేశించారు. పలు మార్లు స్థలయజమాని కార్యాలయం చుట్టు తిరిగిన ఫలితం శూన్యమైంది. తిరిగి సోమవారం మరోమారు స్పందనలో ఫిర్యాదు చేశారు. స్థలాన్ని చూడకుండా, స్థలం ఉందా?లేదా? అని పరిశీలించడకుండా పట్టాలు ఇవ్వడంపై అధికార యంత్రాంగంపై విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

**పట్టాలను రద్దు చేస్తాం: తహాశీల్దార్ :** సర్వే చేసి నివేదిక అందిన వెంటనే పట్టాలను రద్దు చేస్తామని తహాశీల్దార్ స్వర్ణలత అన్నారు. ప్రయివేటు స్థలానికి పట్టాలు ఇచ్చే హక్కు లేదని, సర్వేనెంబర్ పొరపాటున తప్పుగా పడిందన్నారు. విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తామని తహాశీల్దార్ వివరించారు.

# విద్యార్థులు..ఎలిఫెంట్ ఎగ్జామ్ యాప్‌ను వినియోగించుకోండి

## - యాప్ సృష్టికర్త, ప్రైవేటు ఉపాధ్యాయుడు నూర్



ప్లేస్టోర్‌లో అందుబాటులోవున్న ఎలిఫెంట్ ఎగ్జామ్ యాప్ , యాప్ సృష్టికర్త ప్రైవేటు ఉపాధ్యాయుడు నూర్

ఉరవకొండ, మే 8 ప్రభాతవార్త : విద్యార్థులు వేసవి సెలవులను వృధా చేసుకోకుండా ఆన్‌డ్రాయిడ్ మొబైల్ ఫోన్ ద్వారా ప్లేస్టోర్‌లో అందుబాటులోవున్న ఎలిఫెంట్ ఎగ్జామ్ యాప్‌ను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని యాప్ సృష్టికర్త, ప్రైవేటు ఉపాధ్యాయుడు నూర్ కోరారు. సోమవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ఎలిఫెంట్ ఎగ్జామ్ యాప్‌లో విద్యార్థులు పరీక్షల ద్వారానే తమ విజ్ఞానాన్ని పెంచుకోగలరని 222 పరీక్షలకు 5,000 ప్రశ్న..జవాబులను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. వీటి ద్వారా విద్యార్థులు సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్రం, గణితం, ఆంగ్లం తదితర వాటిలో వారి జ్ఞానాన్ని ఎన్ని సార్లు అయినా పరీక్షించుకునే వీలు కల్పించామని విద్యార్థులకు 365 రోజులకు సంబంధించిన సామెతలు, 100 కథలు, కంప్యూటర్ సమాచారం ఉచితంగా అందుబాటులో ఉంచామన్నారు. 10వ తరగతి పరీక్షల్లో ఇంగ్లీష్, లెక్కలు, సైన్సులో ఫెయిల్ అయ్యారని బాధపడతున్నారని వారు ముందునుండే ఆయా సబ్జెక్టుల్లో బేసిక్స్‌ను నేర్పించడం మంచిదని భావించి రూపొందించిన ఎలిఫెంట్ ఎగ్జామ్ యాప్‌ను వినియోగించుకొని వుంటే ఎంతో ఉపయుక్తంగా ఉండేదని నూర్ పేర్కొన్నారు.

# పెన్నహోబిళంలో చురుగ్గా పారిశుద్ధ్య పనులు

## -పర్యవేక్షించిన ఎంపీడీఓ పి.చంద్రమౌళి


పారిశుద్ధ్య పనులు జరుగుతున్న దృశ్యం

ఉరవకొండ, మే 8 ప్రభాతవార్త : మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో సోమవారం పారిశుద్ధ్య పనులు ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల నేపధ్యంలో మండలంలోని ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీతోపాటు, పెద్దముష్టూరు, ఇంద్రావతి, లత్తవరం, లత్తవరం తాండా, ఆమిద్యాల పంచాయతీల నుండి 23 మంది పారిశుద్ధ్య కార్మికులను డెప్యూటేషన్‌పై రప్పించి వారిచే పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.చంద్రమౌళి సిబ్బందితో కలిసి ఉదయం నుండి దగ్గరుండి పారిశుద్ధ్య కార్మికులచే మాడ వీధులతోపాటు దుకాణ సముదాయాలు, ఆలయ పరిసర ప్రాంతాలు, కోనేర్లవద్ద చెత్తా చెదారాన్ని శుభ్రం చేయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఏఇఇ ఫమీదా పర్యవేక్షణలో క్షేత్రంలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సిస్టమ్ ట్యాంకులు, జీఎల్ఎస్ఆర్, ఓహెచ్ఎస్ఆర్‌కు చర్యలు చేపట్టడంతోపాటు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత క్రీడా శిక్షణ

ఉరవకొండ, మే 8 ప్రభాతవార్త : ఈనెల 10వ తేదీ నుండి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభించడం జరుగుతుందని ఆసక్తి కల్గిన ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి విలేఖరులతో మాట్లాడారు. ఉచిత శిక్షణ శిబిరంలో వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఖోఖో, టేబుల్ టెన్నీస్ క్రీడలలో అత్యుత్తమ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

# మోడల్ స్కూల్‌కు మహర్దశ

అగళి, మే 8 ప్రభాతవార్త : అగళి ఆదర్శ పాఠశాలను గత నెల రోజుల క్రితం ఎంపిడిఓ నరేంద్రకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదర్శపాఠశాలతోపాటు హాస్టల్ భవనాన్ని కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చక్రధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాఠశాలలోకి వెళ్లాలంటే ఇక్కడి రోడ్డు అధ్వానంగా ఉందని ఒక్కరోజు వర్షం వస్తే పాఠశాలకు వెళ్లే దారిలో మోకాళ్లలోతు నీళ్లు నిల్చుంటాయని ఇది ఇబ్బందికరమని విద్యార్థులు, అధ్యాపకులు ప్రిన్సిపాల్ ఎంపిడిఓ దృష్టికి తీసుకెళ్లగా అందుకు స్పందించి ఎంపిడిఓ సదరు రోడ్డుకు రూ.5లక్షలను మంజూరు చేశారు. 5 లక్షలతో అక్కడి రోడ్డు నుంచి ఆదర్శ పాఠశాల వరకు సిమెంట్ రోడ్డు నిర్మించాలని తెలపడంతోపాటు ఆ పని ప్రారంభించడానికి ఇంజనీర్‌తోపాటు ఈ రోజు పని చేసే కాంట్రాక్టర్ అక్కడికి వెళ్లి స్థల పరిశీలన చేశారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపిడిఓ


కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఓ

అగళి, మే 8 ప్రభాతవార్త : మండల పరిధిలోని పి.బ్యాడిగెర పంచాయితీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఓ నరేంద్ర కుమార్, ఏపిఓ శివన్న సోమవారం పరిశీలించారు. వందమందికిపైగా కూలీలు పని చేస్తున్నారని ఏపిఓ తెలిపారు. ప్రభుత్వం కూలీలకు మంచి కూలీ ఇస్తున్నందునే ఉత్సాహంగా కూలీలు ఈ పనుల్లో పాల్గొని పని చేస్తున్నారని ఎంపిడిఓ అన్నారు. ఉపాధిహామీ కూలీలకు ఒకవరమని దీనిని సద్వినియోగం చేసుకుని పిల్లలను బాగా చదివించి వృద్ధిలోనికి తీసుకురావాలని ఎంపిడిఓ నరేంద్రకుమార్ కూలీలతో అన్నారు.

# 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి

## -ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డి.ప్రశస్తకుమారి


ప్రిన్సిపాల్ డి.ప్రశస్తకుమారి

ఉరవకొండ, మే 8 ప్రభాతవార్త : మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో చేరడానికి ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో సిఎస్‌సి.ఎపి.జిఒవి.ఇన్, ఎపిఎంఎస్.ఎపి.జిఒవి.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ డి.ప్రశస్తకుమారి సూచించారు. సోమవారం ప్రిన్సిపాల్ విలేఖరులతో మాడ్లాడుతూ ఈనెల 10వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని జూన్ 11న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. 16న మెరిట్ లిస్టు, 18న సెలక్షన్ లిస్టు విడుదలవుతుందని 19న సర్టిఫికేట్ల పరిశీలన, కౌన్సెలింగ్, 21 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు 150 రూపాయలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 75 రూపాయలు దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరీక్షల్లో అర్హత సాధించాలంటే ఓసీలకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు 30 మార్కులు తెచ్చుకోవాల్సి ఉంటుందని వివరించారు.

# పెన్నహోబిళ క్షేత్రంలో ప్రారంభమైన ఉచిత వైద్య శిబిరం

## -12వ తేదీ వరకు భక్తులకు అందనున్న వైద్య సేవలు


పి.కౌకుంట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మొదలైన ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎంపీడీఓ పి.చంద్రమౌళి, ఆలయ ఈఓ కె.విజయ్‌కుమార్

ఉరవకొండ, మే 8 ప్రభాతవార్త : మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో లక్ష్మినరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పి.కౌకుంట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం కొండపైన ప్రధానాలయంవద్ద ఉచిత వైద్య శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.అనికేత్ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ వరకు ఉచిత వైద్య శిబిరం 24 గంటలూ పనిచేస్తుందని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత వైద్య శిబిరంలో రోగులను పరీక్షించడంతోపాటు వారికి అవసరమైన మందులను ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఎండలు మండిపోతున్నవేళ వడదెబ్బ బారిన పడకుండా భక్తులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. గంటకు ఒకసారి ఒక గ్లాసు నీళ్లు తాగాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంవల్ల రోగాలు దరిచేరవని గ్రహించాలన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఉదయం ఎంపీడీఓ పి.చంద్రమౌళి, ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌడప్ప, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, ఆరోగ్య సహాయకులు నాగరాజు, వరలక్ష్మి, చంద్రకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజ్ఞాన భాండాగారాలైన గ్రంధాలయాలను సద్వినియోగం చేసుకోండి

## -ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కె.అరుణజ్యోతి


మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కె.అరుణజ్యోతి

ఉరవకొండ, మే 8 ప్రభాతవార్త : విజ్ఞాన భాండాగారాలైన గ్రంధాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కె.అరుణజ్యోతి పేర్కొన్నారు. పట్టణంలోని శాఖా గ్రంధాలయంలో సోమవారం వేసవి ఉచిత విజ్ఞాన శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమం గ్రంధాలయ అధికారి వై.ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగగా వైస్ ప్రిన్సిపాల్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కె.అరుణజ్యోతి మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు వృధా చేయకుండా జ్ఞాన సమపార్జన కోసం గ్రంధాలయానికి రావాలని సూచించారు. వై.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ శిబిరంలో స్టోరీ టెల్లింగ్, స్టోరీ రీడింగ్ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సర్ శాలిని పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చినుకు పడితే చాలు రోడ్డు చిత్తడే


పులికుంట మట్టి రోడ్డు దృశ్యం

అమరాపురం,మే 8,ప్రభాతవార్త: మండలంలో పులికుంట గ్రామంలోని వలన.ఆగ్రహారం,అమరావురం గ్రామాలకు వెల్లాలంటే తెలికపాటి వర్షం వస్తే చాలు మట్టి రోడ్డు చిత్తడిగా మారి ప్రజలు ప్రయానించడానికి తీవ్ర ఇబ్బందులు నెలకోన్నాయి. వాహనాలు వెల్లాలంటే మరీకట్ట తరంగా మారింది.మట్టి రోడ్డు తారు రోడ్డుగా మార్చలని అనేక సార్లు విన్నవించిన కూడ పట్టించుకోనే నాతుడు కరువయినట్లు గ్రామ ప్రజలు పెర్కొన్నారు.అనేక సార్లు గ్రమ ప్రజలు అధికారులకు ,ప్రజాప్రతినిధులకు విన్నవించినా కూడా ఫలితం తేకపోయిందని గ్రామ ప్రజలు అవేదన వెక్తం చెస్తున్నారు.ఇప్పటికైనా సంబందించిన అధికారులు దృష్టి సారించి తారు రోడ్డు వేసి ప్రజలకు సౌకర్యాలను కల్గించాలని కోరుతున్నారు.

# భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయండి -మాజీ మంత్రి పల్లె


సంయుక్త కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీమంత్రి పల్లె, తెదేపా నాయకులు

పుట్టపర్తిటౌన్, మే 08, ప్రభాత వార్త : జిల్లాలో ముదిగుబ్బ నుండి బుక్కపట్నం వరకు వేయనున్న జాతీయ రహదారికి భూములు, ఇళ్ళు కోల్పోతున్న బాధితులకు న్యాయవరమైన నష్టపరిహారం అందించాలని మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి, చంద్రాయునిపల్లికి చెందిన రైతులు గృహాలు కోల్పోతున్న బాధితులతో కలసి జాయింట్ కలెక్టర్ టి.ఎస్.చేతన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ, జాతీయ రహదారి 362 బుచ్చయ్యగారి పల్లి మీదుగా వెళుతున్నందున 58 గృహాలు కోల్పోతున్నారని, వారందరికీ 2013 భూసేకరణచట్టం ప్రకారం తగినధరను చెల్లించాలన్నారు. పునరావాస చట్టంక్రింద వారికి ఇళ్ళస్థలాలు చూపించి ప్రభుత్వ ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని, ప్రస్తుత ధరలమేరకు విలువకట్టి తగినన్యాయమైన పరిహారం అందించాలన్నారు. బాధితుల అనుమతి మేరకే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఈ రహదారి కోసం విలువైన పండ్ల తోటలు కోల్పోవాల్సిన వస్తోందన్నారు. ఆ రైతులందరి అనుమతి తర్వాతనే తగిన ధర చెల్లించాలన్నారు. గృహాలు కోల్పోతున్న స్థలాలు రహదారి ప్రక్కనే ఉన్నందు సెంటు ధర రూ.5లక్షలు పలుకుతోందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం సరైన నష్టపరిహారం అందించాలన్నారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్ మాట్లాడుతూ, బాధితులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బుక్కపట్నం మండల టిడిపి కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, శివ, జయరాం, సురేంద్రబాబు, ఆంబులెన్స్ రమేష్ పలువురు బాధితులు పాల్గొన్నారు.

# దేవాలయ అభివృద్ధికి రిటైర్డ్ జడ్జి విరాళం


విరాళం అందజేస్తున్న రిటైర్డ్ జడ్జి

అమరావురం, మే 8,ప్రభాతవార్త: మండల పరిధిలో ఉప్పార్లపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వీరలింగేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి తమ్మడేపల్లి గ్రామ వాసి రిటైర్డ్ జడ్జి శివశంకర్ దంపతులు 10వేల రూపాయల విరాళాన్ని కుంచిటి ఒక్కలిగా కార్పోరేషన్ డైరెక్టర్ రాజేశ్వరి శంకరరెడ్డికి అందజెశారు.అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రిటైర్డ్ జడ్జి దంపతులకు ఆలయ కమీటితో పాటు గ్రామ ప్రజలు సన్మాణ కార్యక్రమం నిర్వహించారు.

# వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం


వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించిన విశ్రాంతి ఉపాధ్యాయుడు

రొద్దం,మే 8,ప్రభాతవార్త: రొద్దం శాఖ గ్రంథాలయం నందు వేసవి శిక్షణ తరగతులను సరస్వతి పూజ,ప్రార్థనలతో ప్రారంభించారు.ఈ కార్యక్రమునకు ముఖ్య అతిధిగా విశ్రాంత ఉపాధ్యాయులు లక్ష్మిరెడ్డి మరియు సి.రామాంజనేయులు,ఓబులేశులు విచ్చేశారు.గ్రంథాలయ అధికారి నాగరాజు అధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమునకు విచ్చేసిన అతిధులు సమ్మర్ క్యాంప్ గురించి వివరించారు.గ్రంథాలయ అధికారి నాగరాజు మాట్లాడుతూ జూన్ 11 వరకు సమ్మర్ కాంప్‌లో పిల్లలకు ఆట,పాట,మాట ద్వారా విద్యను నేర్చుకోవాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఖోఖో,క్యారమ్స్,పుస్తక పఠనం, చెస్ మొదలైన కార్యక్రమాలు జరిగాయి.ఈ రోజు లాగే జూన్ 11 వరకు ప్రతి రోజూ గ్రంథాలయంకు హాజరై ఈ కార్యక్రమంను సద్వినియోగం చేసుకోగలరు అని నాగరాజు తెలిపారు.

# పద్మశ్రీ అవార్డు గ్రహీతను కలసిన వాల్మీకి సోదరులు


సన్మానిస్తున్న దృశ్యం

అమరావురం, మే 8,ప్రభాతవార్త: మండల పలిధిలో హాలుకూరు గ్రామానికి చెందిన వాల్మీకి సోధరులు రాఘవేంద్ర మరియు అగ్రామానికి చెందిన వాల్మీకి యుఖ్యనాయకులు పద్మశ్రీ సన్మాణ గ్రహిత సాలుమరద తిమ్మక్కను కలసి సన్మానించారు.ఈ నెల 28వ తేదిన హిందూపురంలో రాఘవేంద్ర కుటుంబ సభ్యుల గృహ ప్రవేసం సంధర్భంగా మొక్కలు పంపిని చేసే కార్యక్రమానికి పద్మశ్రీ అవార్డు గ్రహితను ఆహ్వానించినట్లు వారు పెర్కొన్నారు.

# వేసవి కాలం దృష్ట్యా ప్రత్యేక శిక్షణ తరగతులు


వేసవి శిక్షణ శిభిరంలో పాల్గొన్న విద్యార్థులు

తాడిమర్రి, మే 8 ప్రభాతవార్త : గ్రంథాలయంలో వేసవి కాలం దృష్ట్యా వేసవి శిక్షణ శిభిరాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి శీనా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం, చూసిరాత, అనర్గల ప్రసంగం తదితర తరగతులను నిర్వహించామన్నారు. ఈ శిక్షణ శిభిరం దాదాపు 40 రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని పాఠకులు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పాఠకులకు అర్థం అయ్యే రీతిలో నూతనంగా కొన్ని పాఠ్యపుస్తకాలు వచ్చాయని వాటిని కూడా గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి అధ్యాపకులు రామకృష్ణ, సిబ్బంది వీరనారయప్ప, పాఠకులు పాల్గొన్నారు.

# వాల్మీకి ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, మే 08, ప్రభాతవార్త : ఇటీవల విడుదలైన 10వతరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాల యందు ఉత్తమ ప్రతిభ కనబరచిన ఉమ్మడి జిల్లాల విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోపు వాల్మీకి ప్రతిభాపురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని శ్రీసత్యసాయి వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు టి.జయరాం, ప్రధాన కార్యదర్శి ఎస్.చంద్రమోహన్, కోశాధికారి సాయినాథ్‌లు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలియజేశారు. 10వ తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు 400లకుపైగా మార్కులు, ప్రైవేటు పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 500 ఆపై మార్కులు వచ్చినవారు అర్హులన్నారు. అలాగే ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం నందు ప్రభుత్వ కళాశాలల్లో చదివిన వారు మొదటి సంవత్సరం 400లకుపైగా, ద్వితీయ సంవత్సరం 850కుపైగా, ప్రైవేటు కళాశాలల్లో చదివిన వారు మొదటి సంవత్సరం 460కుపైగా, ద్వితీయ సంవత్సరం 900లకుపైగా మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఈ నెల 20వ తేదిలోపు తమకు సంబంధించిన కుల, నివాస, ధృవీకరణ పత్రాలు, మార్క్స్ మెమో, ఫోన్ నెంబర్‌వేసి వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం అక్కులప్ప, డోర్ నెంబర్ 27-787, సంగమేశ్ నగర్, అనంతపురం చిరునామాకు చేర్చవలసి ఉంటుందన్నారు.

# చికిత్స పొందుతూ చిన్నారి మృతి


మృతిచెందిన చిన్నారి షాహిస్తా (ఫైల్‌ఫోటో)

బత్తలపల్లి, మే 8 ప్రభాతవార్త : మండలంలోని పోట్లమర్రి సమీపంలో మార్చి 17న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి ఆదివారం రాత్రి మృతిచెందినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు మార్చి 17న ఆటో, బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీ కొన్న ప్రమాదంలో ఆరుగురు మృతిచెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో ధర్మవరం పట్టణానికి చెందిన షాహిస్తా(8) అనే చిన్నారి సైతం ఆటోలో ప్రయాణిస్తూ తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదంలో ధర్మవరం పట్టణానికి చెందిన షాహిస్తా తండ్రి షేక్ ఫయాజ్(50) అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో గాయపడిన చిన్నారి షాహిస్తాను తొలుత ఆర్డీటికీ తరలించి చికిత్స అందించార. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడి నుండి మరింత మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలిచారు. అక్కడ 50రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఆదివారం రాత్రి మృతిచెందిందన్నారు. ప్రభుత్వం సైతం షాహిస్తా చికిత్సల కోసం రూ. 5లక్షలు అందించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహర్ష తెలిపారు.

# పుస్తకపఠనతోనే విజ్ఞానం


ఎంఇఒ రవినాయక్ మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి, మే 8 ప్రభాతవార్త : విద్యార్థులు ఉపాధ్యాయులు బోధిస్తున్న విద్యను అభ్యసిస్తూనే పుస్తక పఠనం ద్వారా మెరుగైన విజ్ఞానాన్ని పెంపొదించుకోవచ్చని విద్యాశాఖాధికారి రవినాయక్ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకసమీక్ష, చిత్రలేఖనం, క్యారమ్స్, తదితర అంశాలను శిబిరంలో నిర్వహిస్తారని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువంటే మాకు ఇష్టం అన్న కాన్సెప్ట్‌తో ప్రభుత్వం విద్యను పోత్సహిస్తోందన ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రామాంజినేయులు, ఉపాధ్యాయులు ఆదినారాయణ, నాగరాజు, వీరాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

# రామస్వామి ఆలయం అభివృద్ధిపై సమీక్ష


ఆలయ అభివృద్ధిపై సమావేశాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి, మే 8 ప్రభాతవార్త : పట్టణంలోని కోట ప్రాంతంలో వెలసిన అతిపురాతన రామస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులపై సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూల్ జిల్లా చిప్పగిరి మండలానికి చెందిన బెల్డోన మఠాధిపతి రామనాథస్వామి ఆలయ పునరుద్ధరణ పనులపై చర్చలు నిర్వహించారు. ఆలయ ప్రాశస్త్యం దెబ్బతినకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ఆయన తెలియచేశారు.. ఈ కార్యక్రమంలో వైకాపా పట్టణ కన్వీనర్ హుసేన్‌పీరా, వెంకటరాముడు, గురుప్రసాద్ యాదవ్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు శివప్రసాద్, కార్యదర్శి కుళ్లాయిచౌదరి, ఉపాధ్యక్షులు మాకం శ్రీకాంత్, నాగరాజు, సంపత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి విజ్ఞాన శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి - ఎంపిపి కరణం పుష్పావతి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి కరణం పుష్పావతి

విడపనకల్లు, మే 8 ప్రభాతవార్త : వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి కరణం పుష్పావతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గ్రంథాలయ అధికారి ఎం.శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల ఎంపిపి కరణం పుష్పావతి వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను వృధా చేసుకోకుండా గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. గ్రంథాలయాల్లో వివిధ రకాల పుస్తకాలు వున్నాయని వాటిని చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం పుస్తక ప్రదర్శన, పుస్తక పఠనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మహబూబ్‌బాష, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, జిల్లా ఎస్‌సి సెల్ నాయకుడు సుంకన్న, దేశాయి సిద్దార్థ, జనార్ధన్‌రెడ్డి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# పదిలో మెరిసిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని శాలిని

## -విద్యార్థిని అభినందించిన ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు


విద్యార్థిని శాలినికి కేక్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

విడపనకల్లు, మే 8 ప్రభాతవార్త : మండలంలోని పాల్తూరు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పి.శాలిని అనే విద్యార్థిని 10వ తరగతి ఫలితాల్లో 530/600 మార్కులు సాధించి ప్రతిభ చూపింది. దీంతో సర్పంచు బ్యాలారాణి, ఎంపిటిసిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థిని తండ్రి ఓబులేసు విద్యార్థిని పి.శాలినికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# నార్సింపల్లి బత్తలపల్లి రోడ్డు మరమ్మత్తు చేయండి

తాడిమర్రి, మే 8 ప్రభాతవార్త : మండలం నార్సింపల్లి-బత్తలపల్లి గ్రామాలకు వెళ్లే 2 కిలోమీటర్ల తారురోడ్డు అధ్వాన స్థితికి చేరుకుంది. తారు రోడ్డు అంతా అక్కడక్కడ గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా తయారైంది. కనీసం ద్విచక్ర వాహనదారులు కూడా వెల్లలేని స్థితికి ఈ రోడ్డు చేరుకుంది. తాడిమర్రి నుంచి బత్తలపల్లికి వెళ్లాలంటే ఈ మార్గం తక్కువ దూరం కావడంతో అనేక మంది ఈ రోడ్డును ఆశ్రయిస్తుంటారు. తాడిమర్రి నుంచి మాల్యవంతం మీదుగా వెళితే 5 కిలోమీటర్లుచుట్టి వెళ్లాల్సి ఉంది. దీంతో వందలాది వాహనాలు నార్సింపల్లి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్‌అండ్‌బి అధికారులు చొరవ తీసుకుని రోడ్డును మరమ్మత్తు చేయాలని కోరుతున్నారు. నార్సింపల్లి గ్రామంలో మాజీ డిజిపి జెజెరాముడు, ఐఆర్ఎస్ అధికారి నరసింహప్ప, మరో ఇద్దరు సిఐలు, ఇద్దరు సబ్ ఇన్స్‌పెక్టర్లు ఈ ఊరిలో ఉన్నప్పటికీ ఈ రోడ్డుమాత్రంమరమ్మత్తుకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని రోడ్డు మరమ్మత్తు చేయాలని కోరుతున్నారు.

05ATP08_05ATP08.qxd 08-05-2023 PM 11:29 Page 1



# బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్న వాలెంటీర్లను తొలగించడం దౌర్భాగ్యం

## - కౌన్సిలర్ దిల్షాద్ దునిషా వైకాపా పట్టణ అధ్యక్షులు కెఎస్ బహావుద్దీన్

కదిరి, మే 8 ప్రభాతవార్త

బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్న 10వ వార్డులోని వాలెంటీర్లు షమీర్, సహామిదలను తొలగించడం దౌర్భాగ్యమని కౌన్సిలర్ దిల్షాద్ దునిషా, వైకాపా పట్టణ అధ్యక్షులు కెఎస్ బాహువుద్దీన్‌లు ఆరోపించారు. వాలెంటీర్లను తొలగించడాన్ని నిరసిస్తూ సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద వార్డు ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను బాధ్యతగా ప్రజలకు చేరవేస్తున్న వాలీలెంటీర్లను తొలగించడం ఎంతవరకు సమంజసమో తెలపాలని డిమాండ్ చేశారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వాలెంటీర్ బాబ్‌జాన్‌ను తొలగించకుండా నిజాయితీగా పని చేసిన వారిని తొలగించడం ఎంత వరకు న్యాయమో తెలపాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. వెంటనే తొలగించిన వాలెం టీర్లను తిరిగి తీసుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేస్తామని హెచ్చరించారు. స్పందించిన కమిషనర్ శ్రీహరిబాబు పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. దీంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్నకు 9వ తేదిన చెబుదాం కార్యక్రమం



మాట్లాడుతున్న ఎంపిపి రమణారెడ్డి

నల్లచెరువు, మే 8,ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం ఎంపిపి అధ్యక్షులు రమణారెడ్డి అధ్యక్షతన ఎంపిటిసి, వైసిపి కార్యకర్తల సమావేశంలో జగనన్న ప్రవేశపెట్టిన కార్యక్రమాల గురించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి రమణారెడ్డి మాట్లాడుతూ భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలోని పథకాలతో పోల్చుకుంటే నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పథకాల విషయంలో ముందంజలో ఉందన్నారు. జగనన్న రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు కైవసంతో నవరత్నాలు రాష్ట్ర ప్రజలకు లబ్ధీ చేకూరేలా ఉన్నాయని, వైఎస్సార్ పెన్షన్ పథకంలో భాగంగా అవ్వ, తాతలకు ఇంటి ముందు గ్రామ, వార్డు వాలంటీర్‌లు తలుపుకొట్టి పెన్షన్ అందజేయడం జరుగుతుంది. నవరత్నాల కార్యక్రమంలో మొదలు అన్ని కార్యక్రమాలు ఇంటి వద్దకే సాధ్యం అని, గత ప్రభుత్వంలో ఎన్ని కార్యక్రమాలు అమలులో ఉన్నా పేదవాన్ని కష్టాలపాలు తప్ప మరేమి లబ్ధీచేకూరలేదన్నారు. నేడు 9వ తేదిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం మొదలవుతుందని, ఈ కార్యక్రమంలో నల్లచెరువు మండల కార్యకర్తలు, నాయకులు, వాలంటీర్‌లు అందరూ కలిసి ప్రతి గడపకు వెళ్ళి 1902, సమస్యలపై, లబ్ధిపొందిన వంటి వాటిపై ఫోన్ కాని, ఎస్ఎంఎస్ ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గతంలో జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో కోటి యాభై లక్షల కుటుంబాలు పాలు పంచుకొని కార్యక్రమాన్ని తోటి మండల కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్‌లు మండల ప్రజల సహకారంతో ముందుకు తీసుకెళ్ళారని, అదేవిధంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని ఎంపిపి రమణారెడ్డి పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సానే, హరినాథ్‌రెడ్డి, మండల సర్పంచ్ అధ్యక్షులు శ్రీనాథ్, తదితరులుపాల్గొన్నారు.

# వాహనాలు తనిఖీ చేసిన సిఐ నిరంజన్‌రెడ్డి



బస్సులో తనిఖీలు నిర్వహిస్తున్న సిఐ నిరంజన్‌రెడ్డి

అమడగూరు, మే 8 ప్రభాతవార్త

మండల సరిహద్దులోని మారు తీపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో కర్నాటక నుండి వచ్చివెళుతున్న వివిధ వాహనాలను సోమవారం నల్లమాడ సిఐ నిరంజన్‌రెడ్డి తనిఖీలు చేపట్టారు. వాహనదారులతో సిఐ మాట్లాడుతూ లైసెన్స్, హెల్మెట్, వాహనాల ఆర్‌సి తప్పనిసరిగా వుండాలన్నారు. ముఖ్యంగా కర్నాటక మద్యం విక్రయించకూడదని మద్యం సరఫరా లాంటివి చేయకూడదని, అలా ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా విక్రయిస్తే వారి వాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా వుంటుందని సిఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లోకేష్, తనకల్లు హెడ్‌కానిస్టేబుల్ మహమ్మద్‌రిఫీ, భార్గవ్, తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

## - గ్రంథాలయ అధికారి బొజ్జేనాయక్



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి సేవియా నాయక్

ముదిగుబ్బ, మే 8 ప్రభాతవార్త

ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రంథాల సంస్థ వారు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి బొజ్జేనాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్‌పిటిసి తిరుమల సేవియా నాయక్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవియానాయక్ మాట్లాడుతూ ఈ శిబిరంలో ఏర్పాటు చేసిన స్పోకెన్ ఇంగ్లీష్, పుస్తకపఠనం, ఇండోర్ గేమ్స్, మ్యూజిక్, తదితర వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి నాగరాజు నాయక్, హరికుమార్ నాయక్‌లు స్వచ్ఛంధంగా తమ సేవలు అందించడానికి ముందుకు వచ్చారన్నారు. పాఠకులు, విద్యార్థులు ఈ శిబిరానికి వచ్చి జ్ఞానసముపార్జన వివిధ పుస్తకాలు చదివి పఠనాశక్తి పెంచుకుని భవిష్యత్తుకు మంచి పునాదులు వేసుకోవాలని ఆయన సూచించారు.

# లారీని ఢీ కొన్న బొలెరో వాహనం

## - ఒకరికి గాయాలు



నుజ్జునుజ్జు అయిన బొలెరో వాహనం

ముదిగుబ్బ, మే 8 ప్రభాతవార్త

మండలంలోని మలకవేముల ఆర్ఓ బ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారుజామున ముందు వెళుతున్న లారీని బొలెరో వాహనం వెనుక నుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్యాపిలికి చెందిన బొలెరో వాహన డ్రైవర్ నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పట్నం ఎస్ఐ శరత్‌చంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని నారాయణ పరిస్థితి విషమంగా వుండడంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్నం ఎస్ఐ తెలిపారు.

# తేలికపాటి వర్షాలకే అధ్వానంగా మారిన కదిరి - రాయచోటీ రోడ్డు

నంబులపూలకుంట, మే 8, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయంకు సమీపంలో నిర్మాణంలో ఉన్న కల్వర్టు వద్ద కొద్దిపాటి వర్షాలకే రహదారి తీవ్ర అధ్వానంగా ఉంది. ప్రజలకు,విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతూ కొన్ని సమయాల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం చాలా బాధాకరమని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా ప్రమాదాలు జరగకుండా త్వరితగతిన కల్వర్టు నిర్మాణం చేపట్టి వర్షపునీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలు వాపోతున్నారు.

# గృహనిర్మాణ లబ్ధిదారులకు సిమెంటు, బిల్లులు చెల్లించాలి-సిపిఐ



ఎంపిడిఓకు వినతిపత్రం ఇస్తున్న సిపిఐ నాయకులు

ఓబుళదేవరచెరువు, మే 8, ప్రభాతవార్త : మండల వ్యాప్తంగా ఉన్న జగనన్న గృహ నిర్మాణ లబ్ధిదారులకు సిమెంటు, బిల్లులు చెల్లించాలని సిపిఐ డివిజన్ కార్యదర్శి అంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం ఎంపిడిఓ పోలప్పకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ అధికారులు అధికార పార్టీ నాయకుల సిఫారసు మేరకు లబ్ధిదారులకు ప్రాధాన్యాతను ఇస్తూ బిల్లులు, సిమెంటు అందచేస్తున్నారని ఆరోపించారు. అలా కాకుండా ఇంటి నిర్మాణాలు చేపడుతున్న వారందరికి బిల్లులు మంజూరు చేయాలని ఎంపిడిఓకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చలపతి, రామచంద్ర, రవికుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయండి-సిపిఐ

ఓబుళదేవరచెరువు, మే 8, ప్రభాతవార్త : ఈ నెల 13, 14, 15 తేదీల్లో లేపాక్షిలో సైద్ధాంతిక రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని సోమవారం సిపిఐ కాలనీ సిపిఐ నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి అంజనేయులు మాట్లాడుతూ దేశ, రాష్ట్ర రాజకీయాలు, సైద్దాంతిక సిద్ధాంతాలు, విజ్ఞానంపై మూడు రోజుల పాటు శిక్షణా శిబిరంలో పార్టీ శ్రేణులకు అవగాహన కలిగిస్తారన్నారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, రవి, రామచంద్ర, లక్ష్మీనరప్ప తదితరులు పాల్గొన్నారు.

# టిడిపితోనే అభివృద్ధి సాధ్యం



ఇదేం ఖర్మలో పాల్గొన్న టిడిపి నాయకులు

ఓబుళదేవరచెరువు, మే 8, ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అని మండల కన్వీనర్ జయచంద్ర ప్రజలకు వివరించారు. మండల కేంద్రంలో సోమవారం ఇదేం ఖర్మ మనం రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి వైకాపా పాలనలో జరుగుతున్న అవినీతి అక్రమాల గురించి ప్రజలకు వివరించారు. పరిపాలన దక్షత కలిగిన నాయకుడు చంద్రబాబు అని ఆయన పాలనలో రాష్ట్రం పురగోమదిశగా పరగులు పెట్టిందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మర్చాడాని, హింసా, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాన్నారు. కావున చంద్రబాబు ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే రాష్ట్రంలోని ప్రజలు సుభిక్షంగాను, సురక్షింతంగాను ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు తెలుగుయువత జయచంద్రారెడ్డి, నియోజకవర్గ టిఎన్‌టియుసి అధ్యక్షుడు నిజాం, తెలుగు యువత మండల అధ్యక్షుడు కొండే ఈశ్వరయ్య, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మండోజి ఆరీఫ్‌ఖాన్, మైనార్టీ మండల అధ్యక్షుడు షాను, మహిళా ప్రధాన కార్యదర్శి మస్తానమ్మ, మైనార్టీ నాయకులు షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న పూల శ్రీనివాస్‌రెడ్డి

నల్లచెరువు, మే 8, ప్రభాతవార్త:

మండల పరిధిలోని తలమర్ల వాండ్లపల్లి గ్రామం పంచాయతీ లోని ఉప్పర్లపల్లి చెందిన షేక్ మహబూబ్ భాషా అనే యువకుడు గత నెల రోడ్డు ప్రమాదంలో గాయపడటం జరిగింది. విషయం తెలుసుకున్న వైసిపి సిఈసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి గ్రామానికి సందర్శించి గాయపడిన యువకుడిని పరామర్శించి ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చి రూ. 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పూల శ్రీనివాస్‌రెడ్డితో పాటు బిసి కార్పోరేషన్ డైరెక్టర్ దశరథనాయుడు, జెడ్పిటిసి భర్త బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు బావాఖాన్, రామ్‌కిషోర్‌రెడ్డి, ఎంపిటిసి రామాంజినేయులు, నాగార్జున, వైసిపినాయకులు పాల్గొన్నారు.

# యాడికి మండలంలో ప్రభుత్వ జూనియర్‌కళాశాల ఏర్పాటు చేయండి - బిజెపి



తహాశీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న బిజెపి నాయకులు

యాడికి, మే 8 ప్రభాతవార్త

యాడికి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాని కోరుతూ బిజెపి నాయకులు సోమవారం తహశీల్దార్ అలెగ్జాండర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు పొట్టే గంగాధర్ మాట్లాడుతూ యాడికి మండల విద్యార్థుల భవిష్యత్తు కొరకు ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. తాడిపత్రి నియోజకవర్గంలో జనాభా విస్తీర్ణంలో అతి పెద్దది యాడికి మండలమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యార్థులకు ప్రభుత్వ కళాశాల లేనందుకు ముఖ్యంగా విద్యార్థినీలు ఉన్నత విద్య అభ్యసించేందుకు ప్రతి రోజు 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వసోందన్నారు. తల్లిదండ్రులకు విద్యార్థులను చదివించడం భారంగా మారుతోందన్నారు. పై సమస్యలను దృష్టిలో వుంచుకుని తక్షణం యాడికి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి చింతా చౌదయ్య, కిసాన్‌మోర్చా అధ్యక్షులు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, ఓబిసి మోర్చా అధ్యక్షులు రంగస్వామి, కార్యదర్శి ప్రసాద్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోండి - గ్రంథాలయ అధికారి



గ్రంథాలయంపై అవగాహన కల్పిస్తున్న వక్తలు

యాడికి, మే 8 ప్రభాతవార్త

మండల కేంద్రం పంచాయతీ కార్యాలయం సమీపంలో వున గ్రంథాలయంలోని సోమవారం నుండి విద్యార్థుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. వేసవి క్యాంపు శిక్షణ తరగతులను ముందుగా చదువులతల్లి సరస్వతిదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి లాంచనంగా ప్రారంభించారు. వేసవి శిక్షణ శిబిరం గురించి విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి కథల పుస్తకాల ద్వారా కథలు వినుట, పుస్తక సమీక్ష, చిత్రలేఖనము, క్యారమ్స్, ఫేస్ స్నేక్ అండ్ లాడర్ వంటి అనేక సృజనాత్మక కథలు ప్రతి రోజు నిర్వహిస్తామన్నారు. ఈ సమ్మర్ క్యాంప్ ఈ నెల 8 నుండి జూన్ 11 వరకు నిర్వహించడం జరుగుతుందని గ్రంథాలయ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, వెంకటేషులు, వెంకటరమణ, కొత్తరాయుడు, జయకృష్ణ, పాండవులు నాయుడు, సాయిరాం, లక్ష్మినారాయణ, వినయ్‌కుమార్, వి రూపాక్షి, తాండ్రకుమార్, వేణుగోపాల్, విద్యార్థినీ, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం



సమావేశమైన ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు

యాడికి, మే 8 ప్రభాతవార్త

ఏపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజన్న ఆదేశాల మేరకు తాడిపత్రి నియోజకవర్గంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యదర్శి రవికుమార్, తాడిపత్రి వర్కింగ్ ప్రెసిడెంట్ బండి మహేష్ ఆధ్వర్యంలో ఎంఆర్‌పి ఎస్ నాయకులు, కార్యకర్తలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో సమాజసేవలో పాల్గొనాలని, వివిధ సామాజిక కార్యక్రమాలను ముమ్ముందు చేపడుతున్నట్లు వారు తెలిపారు. సంఘం సభ్యులు సమాజంలో తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకరావాల్సిందిగా పెద్దవడుగూరు మండలంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

# నేటి నుంచి అనంతలో స్త్రీ విముక్తి సంఘటన మహాసభలు




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్త్రీ విముక్తి సంఘటన నాయకురాల్లు

అనంతపురం, మే 8, ప్రభాతవార్త బ్యూరో : నేటి (మంగళవారం) నుండి రెండు రోజుల పాటు నగరంలోని మూడవరోడ్డులో ఉన్న చిన్నజీయర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు స్త్రీ విముక్తి రాష్ట్ర అధ్యక్షురాలు విజయ తెలియచేశారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో పలు విషయాలు చర్చించి భవిష్యత్తు కార్యచరణ రూపిందించనున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ముఖ్యమైన ప్రతినిధుల పాల్గొంటారని ఈ మహాసభలను విజయవంతం చేసేందుకు భారీ సన్నాహాలు చేశామన్నారు. ఈ మహాసభల్లో ముఖ్య వక్తలుగా బి సూర్యసాగర్, తోట జ్యోతిరాణి, రచయితలు శీల సుభద్రాదేవి, జి నిర్మలరాణి, ఎస్ యూన్నీ, చెన్నుపాటి మంజుల, ఎం లక్ష్మి, సి పెద్దన్న, తరిమెల అమర్నాథ్‌రెడ్డి, ఎస్ఎం బాష తదితరులు పాల్గొని సభలో మాట్లాడుతారన్నారు.

# శ్రీబుగ్గరామలింగేశ్వరునికి పంచామృతాభిషేకాలు



శ్రీబుగ్గరామ లింగేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

తాడిపత్రిఅర్బన్, మే 8 ప్రభాతవార్త

పట్టణంలోని పురాతన శ్రీ బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వైశాఖమాస పురస్కరించుకుని ఉదయం స్వామివారికి అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, నందు స్వామిలు పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారికి మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు శంకరయ్యశర్మ, గిరిశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకపోస్టుకు దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రిరూరల్, మే 8 ప్రభాతవార్త

పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్ట్ బోధించేందుకు అతిథి అధ్యాపకపోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో, యుజిసి నెట్/ సెలెక్ట్ అర్హత కలిగి వుండాలన్నారు. (పిజి) ఎంకాం కోర్సులో 55 శాతం మార్కులు కలిగి వుండాలన్నారు. అర్హతగల అభ్యర్థులు తమ అనుభవము, విద్యార్హత వివరాలతో కూడిన దరఖాస్తును కళాశాల కార్యాలయంలో ఈ నెల 20వతేదీలోపు అందచేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

# యాడికి మండల విలేకరుల నూతన కార్యవర్గం ఎంపిక



ఎన్నికైన జర్నలిస్టుల నూతన కార్యవర్గం

యాడికి, మే 8 ప్రభాతవార్త

యాడికి మండల కేంద్రంలోని ఎంపిడిఓ సమావేశపు భవనంలో పాత్రికేయులు సోమవారం నిర్వహించిన ఓ సమావేశంలో యాడికి మండల జర్నలిస్టు సంఘం గౌరవాధ్యక్షులుగా షణ్ముఖరెడ్డి, సారెడ్డి రామచంద్రారెడ్డి, మండల జర్నలిస్టు సంఘం అధ్యక్షునిగా విశాలాంధ్ర ఫరూక్, ఉపాధ్యక్షునిగా మాటకోసం జోగిరెడ్డిలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడుతామని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులుగౌడ్, సంజీవనాయుడు, నూర్‌బాష, రాయుడు, గన్నె పేరుషోత్తం, కుండా లక్ష్మినారాయణ, డిపి హుస్సేన్‌బాష, మూలింటి శివప్రసాద్, శర్మాస్, ప్రెస్ శీన, ఆలూరు చంద్రశేఖర్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, మామిళ్ల రవి, మహేంద్ర, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీభోగేశ్వరస్వామికి నాగాభరణం వితరణ



నాగాభరణం అందచేస్తున్న దృశ్యం

యల్లనూరు, మే 8 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కోటవీధిలో వున్న శ్రీభోగేశ్వరస్వామికి 3.50 కిలోల వెండితో తయారు చేయించిన నాగాభరణాన్ని రాయదుర్గంకు చెందిన కీర్తిశేషులు అశ్వర్థనారాయణ భార్య ప్రమీల వితరణ చేశారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి అనంతరం స్వామివారికి నాగాభరణాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు చందు, కూరగాయల హరికృష్ణ, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

# పక్షవాతం పేషెంట్‌కు రూ.10 వేలు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందచేస్తున్న దృశ్యం

తాడిపత్రిఅర్బన్, మే 8 ప్రభాతవార్త

పట్టణ సమీపంలోని ఐశ్వర్య విల్లాస్ వద్ద బైపాస్‌రోడ్డు పక్కన కాలనీలో నివాసం వుంటున్న కదూరి చక్రవర్తిరాజు అనే వ్యక్తికి ఆరునెలల క్రితం పక్షవాతం రావడంతో ఒక కాలు, చెయ్యి, మాటలు పడిపోయాయి. అంతేకా కుండా కిడ్నీలు కూడా పాడయ్యాయి. గుండెకు కూడా స్టంట్ వేశారు. జీవితాంతం మందులు వాడాల్సి వుంది. దీంతో వారు ఉమ్మడి గురుప్రసాద్‌రెడ్డిని సంప్రదించగా ఆయన స్పందించి 10 వేల రూపాయలను అందచేశారు.

# 50 శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేయాలి



వినతిపత్రం అందచేస్తున్న బిజెపి నాయకులు

పుట్లూరు, మే 8 ప్రభాతవార్త

ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేయాలని బిజెపి నాయకులు సోమవారం డిప్యూటి తహశీల్దార్ మల్లేష్‌కు వినతిపత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ వస్తుండడంతో పాటు రుతుపవనాలు వస్తున్న సమయంలో రైతులకు వేరుశనగ, కంది, సోయాచిక్కుడు, జొన్న, తదితర పంటలు వేసుకునేందుకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కుందు శ్రీనివాసులరెడ్డి, మండల ఉపాధ్యక్షులు సూర్య నారాయణరెడ్డి, కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు చెన్నారెడ్డి, నాగమల్లారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్‌షాక్‌తో పంచాయతీ కార్మికుడు మృతి



మృతి చెందిన కార్మికుడు

హిందూపురం టౌన్, మే 8 ప్రభాతవార్త

పూలకుంట పంచాయతీ కార్మికుడు గంగాధర్ (43) సోమవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు అప్‌గ్రేడ్ సిఐ కృష్ణారెడ్డి తెలిపారు. నిర్మాణంలో వున్న ఇంటికి సంపు నుండి నీటిని వదిలే సమయంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడన్నారు. వివరాలు ఇలా వున్నాయి. డిబికాలనీకి అనుకుని వున్న మహాలక్ష్మీ లేఅవుట్‌లో నిర్మాణదశలో వున్న ఇళ్లకు నీటిక్యూరింగ్ చేసే పనికి ఒప్పుకున్నాడన్నారు. ఉదయం వచ్చి నీరు పట్టేందుకు మోటర్ ఆన్‌చేయగా విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడన్నారు. అటుగా వెళ్లేవారు సర్పంచు మంజునాథ్ సమాచారం అందించడంతో ఆయన అక్కడికి వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య సునందమ్మ, ఇద్దరు కుమార్తెలు వున్నారు.

